దిన పత్రిక
తొలి సమయం
గురువారం । 2 । జూలై । 2026

## గూడూరు మండలంలో కలకలం..

## మామిడి తోటలో చిరుతపులి సంచారం!




**తొలి సమయం కొత్తగూడ 01 జూలై 2026**

గూడూరు మండలంలో చిరుతపులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. మర్రిమిట్ట గ్రామపంచాయతీ పరిధిలోని తోట దస్రుతండా సమీపంలో చిరుతపులి కనిపించడంతో ప్రజలు వణికిపోతున్నారు. మర్రిమిట్ట గ్రామపంచాయతీ, తోట దస్రుతండా సమీపంలో ఉన్న డాక్టర్ ఏపూరి రవీందర్ రెడ్డికి చెందిన మామిడి తోటలో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు, ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో ఫారెస్ట్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం తోట దస్రుతండా పరిసర ప్రాంతాల్లో చిరుత కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తోటల యజమానులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటకు వెళ్లవద్దని అటవీ శాఖాధికారులు గ్రామస్తులను హెచ్చరిస్తున్నారు. చిరుతపులి ఆచూకీ కోసం అటవీశాఖ సిబ్బంది నిఘా పెంచారు. ఈ ఘటనతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మైసు మణెమ్మ మృతికి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి




**తొలి సమయం కొత్తగూడ 01 జూలై 2026**

మండల కేంద్రానికి చెందిన మైసు మణెమ్మ అనారోగ్యంతో కన్నుమూయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య మాట్లాడుతూ, మణెమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు విరనేని వెంకటేశ్వర్లు, టౌన్ ఉపాధ్యక్షులు వెలుదండి వేణు, కాంగ్రెస్ నాయకులు యాదగిరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొని మైసు మణెమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పీహెచ్‌సీలో ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు

### ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అమూల్యం

### వైద్యాధికారులు డాక్టర్ రవి, డాక్టర్ కిరణ్‌లకు ఘన సన్మానం



**తొలి సమయం మరిపెడ జూలై 1**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో అంతర్జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తూ, మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారులను ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ గుగులోతు రవి, డాక్టర్ కిరణ్ , వైద్య సిబ్బంది శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. వైద్య వృత్తిలో వారి అంకితభావం, సేవా తత్పరతను ప్రశంసిస్తూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్యులు సమాజంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రోగులకు చికిత్స అందించడమే కాకుండా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వ్యాధుల నివారణకు కృషి చేయడం వంటి సేవలను వైద్యులు అందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యుల బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని, పరిమిత వనరులతోనూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ పేదల పాలిట వైద్యులు ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారని తెలిపారు. మరిపెడ వాసవి క్లబ్ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొని వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి సేవలను అభినందిస్తూ ప్రత్యేకంగా సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి కుమారి, స్టాఫ్ నర్సులు పద్మ, సుజాత, రత్నకుమారి, పల్లె దవాఖాన సిబ్బంది ఝాన్సీ, అఖిల, సరిత, సౌజన్య, అనిత, ఏఎన్‌ఎంలు మంజువాణి, ఝాన్సీ, లలిత, నాగమణి, విజయ, కీర్తి, స్వప్న, తులసి, రాములమ్మ, హుస్సేన్ బీ, హరీశ్, శ్రీదేవి, శ్రీలత, రోజమణి తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్క చొరవ చూపాలి

### - టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్



**తొలి సమయం కొత్తగూడ 01 జూలై 2026**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే–ఐజేయు) ఆధ్వర్యంలో సభ్యత్వాల పునరుద్ధరణ, నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం బుధవారం కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడింది. మండల అధ్యక్షుడు ఎస్.కె. సల్మాన్ పాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు దూలం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతే యూనియన్‌కు అసలైన బలమని పేర్కొన్నారు. ప్రతి జర్నలిస్టు తన సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడంతో పాటు అర్హులైన కొత్త జర్నలిస్టులను యూనియన్‌లో సభ్యులుగా చేర్చాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు రవాణా సౌకర్యాల లేమి, మౌలిక వసతుల కొరత, సమాచార సేకరణలో ఎదురయ్యే ఇబ్బందులు, వృత్తిపరమైన సవాళ్లతో పాటు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన రాష్ట్ర మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని, ఏజెన్సీ జర్నలిస్టుల సమస్యలను ప్రత్యక్షంగా అధ్యయనం చేసి, వారి సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అనంతరం సభ్యత్వాల పునరుద్ధరణ, నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేయడం, సభ్యుల ఐక్యతను పెంపొందించడం, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం జిల్లా కమిటీ చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉమ్మగాని మధు, రమణ, సత్యనారాయణ, కోరే పాపన్న, రావూరి ప్రశాంత్, పాలడుగు శ్రీధర్, జంగాల వినయ్ కుమార్, మహమ్మద్ అజ్మీర్, శెట్టి పరశురాములు, మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారులు సునీల్, ప్రచార కార్యదర్శులు ఉబ్బని శ్రీహరి, తీగల ప్రేమ్ సాగర్, రాకేష్ వర్మ, చాపల శ్రీనివాస్, నాంపల్లి రాజ్‌కుమార్, వాసం వెంకటేష్, తాటి సుదర్శన్, బిక్షపతి, యూనియన్ నాయకులు, మండల ప్రతినిధులు, సభ్యులు మరియు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఘనంగా వాంకుడోత్ కొమ్మాలు నాయక్ జన్మదిన వేడుకలు




### కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల భారీ పాల్గొనిక

**తొలి సమయం కొత్తగూడ 01 జూలై 2026గూడూరు:**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ గూడూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న యువ డైనమిక్ నాయకుడు, జనహృదయనేత శ్రీ వాంకుడోత్ కొమ్మాలు నాయక్ జన్మదిన వేడుకలు సోమవారం గూడూరు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, టౌన్ కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కొమ్మాలు నాయక్‌కు పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, కొమ్మాలు నాయక్ ప్రజాసేవనే పరమావధిగా భావిస్తూ గ్రామాభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, సామాజిక సేవ, యువతకు ప్రోత్సాహం, పేదల సంక్షేమం వంటి అంశాల్లో ఆయన మరింత ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, టౌన్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా అఖిలేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



**తొలి సమయం, కామేపల్లి;జూలై, 01:**

కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ 52వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం సభ్యులు, అభిమానులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యువజన ప్రతినిధులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ, అఖిలేష్ యాదవ్ యువ నాయకుడిగా దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని, సమాజ్‌వాది పార్టీని బలోపేతం చేస్తూ సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా యాదవుల ఐక్యత కోసం ఆయన పర్యటిస్తూ చైతన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, గుగులోత్ రవి, షేక్ రబ్బానీ పాషా, శీలం పుల్లయ్య, బండి ఉపేందర్, జక్కంపూడి వెంకటేశ్వర్లు, పాటి బండ్ల ప్రసాద్, బాదావత్ నాగరాజు, కిషన్, నరేష్, మేకల లక్ష్మీనారాయణ, డేరంగుల తిరుపయ్య, మొగిలి శ్రీను, లకావత్ నాగేష్, బద్రు, గుగులోత్ మదార్ పాల్గొన్నారు.

## డఫోడిల్స్‌లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

### చైర్మన్ చింతల నరేందర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

### డాక్టర్ల వేషధారణలో అలరించిన విద్యార్థులు..

### మానవసేవ గొప్పతనంపై చైతన్యం

### డాక్టర్ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ - డఫోడిల్స్ హై స్కూల్ చైర్మన్ చింతల నరేందర్





**తొలిసమయం నర్సంపేట :**

డాక్టర్ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని డఫోడిల్స్ హై స్కూల్ చైర్మన్ చింతల నరేందర్ అన్నారు. బుధువారం నర్సంపేట పట్టణ కేంద్రంలోని డఫోడిల్స్ హై స్కూల్ లోని ఘనంగా జాతీయ డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్ల వేషధారణలో పాల్గొని వైద్య వృత్తి గొప్పతనం, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, సేవాభావం వంటి అంశాలపై ఆకర్షణీయమైన ప్రదర్శనలు నిర్వహించారు. వైద్యుల సేవలు సమాజానికి ఎంత అవసరమో వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చింతల నరేందర్ మాట్లాడుతూ.... విద్య అనేది మార్కులు సాధించడానికి మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలని అందుకే డఫోడిల్స్ పాఠశాలలో విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, మానవతా విలువలు, సేవాభావం పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని విద్యార్థులలో చిన్నప్పటి నుంచే వైద్య వృత్తి వంటి గొప్ప సేవా రంగాలపై అవగాహన కల్పించడం ద్వారా వారి లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పాఠశాల ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పాఠ్యాంశాలతో పాటు అనుభవాత్మక బోధన, అవగాహన సదస్సులు, జాతీయ దినోత్సవాలు, సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సామాజిక స్పృహ పెంపొందిస్తున్నామని డాక్టర్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభ, వేదికపై ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం అందరినీ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు కూడా వైద్య వృత్తి ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఇంచార్జి లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు సన్మానం




**తొలి సమయం, ఇల్లందు;జులై, 01:**

నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ టేకులపల్లి, గాయత్రీ పరివార్ సంయుక్త ఆధ్వర్యంలో ఇల్లందు ప్రజా వైద్యశాలలో డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ రవి తేజస్విలను ఘనంగా సన్మానించారు. వారి వైద్య సేవలను కొనియాడుతూ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, వైద్యులు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, సమాజానికి వారి సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సన్మానానికి స్పందించిన వైద్యులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ టేకులపల్లి, గాయత్రీ పరివార్ సభ్యులు, వైద్యశాల సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## పాత గ్రామీణ ఉపాధి హామీ పథకాన్నే పటిష్టపరిచి అమలు చేయాలి

### మాజీ సొసైటీ చైర్మన్ రామగిరి బిక్షం

### బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ

**తొలి సమయం,మహబూబబాద్ జూలై 1**

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో విబీ జిరాంజీ చట్టాన్ని తీసుకొచ్చిందని, ఇది గ్రామీణ పేదల పని హక్కు గ్యారెంటీని రద్దుచేసి, ఉపాధి హామీని రద్దు పరుస్తుందని మాజీ సొసైటీ చైర్మన్ రామగిరి బిక్షం అన్నారు. ఈరోజు బయ్యారం మండల తహసిల్దార్ కార్యాలయం ముందు అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగిరి భిక్షం ప్రసంగిస్తూ 2005లో వచ్చిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు పని హక్కు కల్పించిందని, ఆ చట్టంలో ఉన్న లొసుగులను సరిచేసి అమలు చేయాల్సింది పోయి దాన్ని రద్దు చేసి కొత్తగా విబి జీరాంజీ చట్టాన్ని తీసుకొచ్చిందని, ఈ చట్టం అమలు ప్రశ్నార్థకంగా ఉందని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఉపాధి హామీ నిధులలో 90% నిధులను భరిస్తున్న కేంద్ర ప్రభుత్వం తన వాటాను 60 శాతానికి తగ్గించుకొని రాష్ట్రాల వాటాను 10 నుంచి 40 శాతానికి పెంచిందని, తద్వారా రాష్ట్రాలకు ఈ పథకం అమలు భారంగా మారిందని ఆయన అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఏడాదికేడాది నీరుగారుస్తూ, ఆ పథకానికి బడ్జెట్లో నిధుల కేటాయింపును తగ్గిస్తూ వచ్చారని, ఇప్పుడు వంద రోజులకు బదులు 125 రోజులు పని కల్పిస్తామనేది బూటకపు హామీయేనని ఆయన అన్నారు. అనంతరం మండల తహసిల్దార్ నాగరాజుకు ఏఐకేఎంఎస్ ప్రతినిధి వర్గం వినతి పత్రం సమర్పించింది. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, న్యూడెమోక్రసీ నాయకులు గౌని ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ళ మురళీకృష్ణ, మెంగు భగవాన్, వీరబోయిన ఐలయ్య, కూనూరి యుగంధర్ , కొదుమూరి నాగేశ్వరరావు, పొన్నం రమేష్, ఎస్.కె మహమూద్, వల్లాల బిక్షం తదితరులు పాల్గొన్నారు.



దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

గురువారం । 2 । జూలై । 2026

## త్వరలోనే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్,పిఆర్సి సాధిస్తాం : పింగళి శ్రీపాల్ రెడ్డి




తొలి సమయం మహబూబాబాద్ జూలై 1

పీఆర్టీయూ టీఎస్ మహబూబాబాద్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మిర్యాల సతీష్ రెడ్డి అధ్యక్షతననిర్వహించిన మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో గౌరవ పీఆర్టీయూ ఎమ్మెల్సీ శ్రీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సంఘ బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యలు, ప్రభుత్వంతో జరుగుతున్న చర్చలపై విస్తృతంగా ప్రసంగించారు. మండల బాధ్యులు లేవనెత్తిన వివిధ సమస్యలపై స్పందిస్తూ ఆయన ముఖ్యంగా ఈ అంశాలను ప్రస్తావించారు: రేషనలైజేషన్ మార్గదర్శకాల్లో అవసరమైన మార్పులు చేయించేలా ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని, ఉపాధ్యాయుల జీతాల పెంపు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు అమలు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా పథకం వర్తించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో టైమ్‌టేబుల్ మార్పు అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం తీసుకునే విషయంలో అన్ని సంఘాల కంటే పీఆర్టీయూ టీఎస్‌కే ఎక్కువ అర్హత, విశ్వసనీయత ఉంది” అని పేర్కొంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో పండిట్, పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం కృషి కొనసాగుతోందన్నారు. మెడికల్ బిల్లుల క్లియరెన్స్ వేగవంతం చేయిస్తామని హామీ ఇచ్చారు. 2003 ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 1 నుంచి అమలు దిశగా చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. రద్దు కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయించే వరకు పీఆర్టీయూ టీఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ గారు ఏఐఎఫ్టీవో జాతీయ ఉపాధ్యక్షురాలు శ్రీమతి గీతా గారు రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గారు జిల్లా సంఘం మాజీ అధ్యక్షులు బద్రీనారాయణ గారు రాష్ట్ర అసోసియేట్ బాధ్యులు హాల్యా నాయక్ గారు మరియు 18 మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే నిజమైన హీరోలు డాక్టర్లు..

### జిల్లా జేఏసీ చైర్మన్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు వడ్డేబోయిన శ్రీనివాస్




తొలి సమయం మహబూబాబాద్ జూలై 1

ప్రజల ఆరోగ్యాలను కాపాడే నిజమైన హీరోలు డాక్టర్లు అని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఒట్టే బోయిన శ్రీనివాస్ అన్నారు జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ ను వడ్డే పోయిన శ్రీనివాస్ శాలువాహతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ మా జీవితాలను మీ త్యాగమే మా ఆరోగ్య భద్రత అన్నారు. ప్రతిక్షణం ప్రజల సేవే వృత్తిగా కొనసాగే డాక్టర్లు దేవదూతలు అన్నారు. దేవుడికి ప్రతిరూపం అన్నారు. ప్రజలను కాపాడుతూ ఏ కష్టం వచ్చినా మేమున్నాము అని ముందు వరుసలో డాక్టర్లు ఉంటా రన్నారు. పుట్టిన బిడ్డ నుండి 100 ఏళ్ళు వచ్చేవరకు చిన్న సమస్య వచ్చినా కాపాడే ప్రత్యక్ష దేవుళ్ళు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్జున్ డాక్టర్ శివకుమార్ హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం మరియు శారద హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ స్వామి మరియు లౌక్య డిపిఎంఓ వాల్యా మరియు నీలిమా మనోహర్ అరుణ్ కుమార్ అనిల్ కుమార్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యో నారాయణో హరి సూక్తిని పూర్తిగా డాక్టర్స్ పనిచేయాలి

### వైద్యులు కనిపించే దేవుళ్ళుసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ సుచిత్ర బాలు నాయక్



తొలి సమయం మహబూబాబాద్ జూలై :

వైద్యో నారాయణో హరి అనే సూక్తిని స్ఫూర్తిగా తీసుకొని డాక్టర్లు పనిచేయాలని మైత్రి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సుచిత్ర బాలునాయక్ ఆకాంక్షించారు.. జాతీయ డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా మైత్రి మల్టీస్పెషల్టి హాస్పిటల్ లో డాక్టర్స్ సిబ్బందిచే కేక్ కట్ చేయించారు అనంతరం వారికి శాలువాతో సన్మానం చేశారు సందర్భంగా సుచిత్ర బాలు నాయక్ మాట్లాడుతూ.. డాక్టర్లు కనిపించే దేవుళ్ళు అని కొనియాడారు. ప్రజల ఆరోగ్యాలను రేయి పగలు అనే టైం బాండ్ లేకుండా ప్రజలను అనారోగ్యాల నుండి కాపాడతారని అన్నారు డాక్టర్స్ అందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఈ క్రింది డాక్టర్లకు సన్మానం చేశారు హాస్పిటల్ చీఫ్ డాక్టర్ సీనియర్ బాలు నాయక్ సన్మానం చేశారు అనంతరం హాస్పటల్ సిబ్బంది డాక్టర్ నరేంద్ర డాక్టర్ నాగార్జున రెడ్డి డాక్టర్ సైదా అలీ డాక్టర్ కుమార్ డాక్టర్ రియాజ్ డాక్టర్ హేమంత్ అందరికీ పుష్పగుచ్చం ఇచ్చి శాలువా మెమొంటో తో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు..

## నాణ్యమైన దర్యాప్తు, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణ ప్రజాకేంద్రీకృత పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

### - జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్

తొలి సమయం మహబూబాబాద్ జూలై 1

జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ బుధవారం (ఈరోజు )మరిపెడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని స్టేషన్ రికార్డులు, సీడీ ఫైళ్లు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ, వివిధ గదులు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. మరిపెడ ఎస్ఐతో పెండింగ్ ఫైళ్లు, దర్యాప్తులో ఉన్న కేసులు, విచారణ నివేదికల తయారీ, వాటి నాణ్యత, సమయపాలనపై సమీక్ష నిర్వహించి, ప్రతి కేసులో చట్టపరమైన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై వారి విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తో ప్రత్యేకంగా మాట్లాడి, గ్రామాల్లో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని, నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన




కల్పించడం, అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి పోలీసులకు అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే దర్యాప్తు అధికారులు ప్రతి కేసుకు సంబంధించిన విచారణ నివేదికలను సమగ్రంగా, వాస్తవాధారాలతో సిద్ధం చేయాలని, ఫైళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో, పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు వంటి బాధితులకు ప్రత్యేక ప్రాధాన్యతతో స్పందించాలని సూచించారు. సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలపై అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, పోలీస్ స్టేషన్‌ను ప్రజలకు నమ్మకమైన సేవా కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సూచించారు.

## కేంద్ర ప్రభుత్వ చర్యలకు గ్రామపంచాయతీ వద్ద నిరసన..

### వి బి జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి..!

### కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య

తొలి సమయం మరిపెడ జూలై 1

జూలై 1 నుండి వి బి జి రాంజీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల ముందు నిరసనలు తెలియజేయాలని అఖిలభారత సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం మండలంలోని అబ్బాయి పాలెం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సిఐటియు, ఏ ఐ కె ఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ముందు నిరసన తెలిపారు. నిరసనకు కెవిపిఎస్ జిల్లా కమిటీ తరఫున ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య సంపూర్ణ మద్దతును ప్రకటించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని స్థానిక పంచాయతీ సెక్రెటరీ కి అందజేశారు. ఈ సందర్భంగా జిన్నా లచ్చయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పోరాడి వామపక్షాల మద్దతుతో సాధించుకున్న మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేసింది దీని స్థానంలో విభీజీ రాంజీ చట్టాన్ని తేవటం జరిగిందని తెలిపారు. 125 రోజులు పని కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసింది. కానీ ఈ పనిలో నిధుల కోత విధిస్తూ చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వానికి 40 శాతం, కేంద్ర ప్రభుత్వాన్ని 60 శాతం నిధులు చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం నిబంధనాలను చట్టంలో తీసుకొచ్చింది. దీంతో పనిచేసిన వారికి సరైన టైంలో డబ్బులు పడక కూలీలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర




ప్రభుత్వం నూతన చట్టాలు తెచ్చినప్పటికీ కనీస వేతన చట్టాన్ని ఈ చట్టంలో పొందుపరచలేక పోవడం దురదృష్టకరం. పని చేసిన ప్రదేశం లోనే ఫోటో అప్లోడ్ చేయాలని పెట్టడంతో ఆ ప్రదేశంలో గూగుల్ నెట్ పనిచేయక గ్రామపంచాయతీ ఏరియా రాంగ్ పడే అవకాశం ఉందని తెలిపారు. ఆరోజు కూలీలు పనిచేసిన ఫోటో అప్లోడ్ కాకపోవడంతో డబ్బులు వచ్చే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. తద్వారా లేబర్ హాజరు లేదనే పేరుతో ఫీల్డ్ అసిస్టెంట్లను, ఉపాధి సిబ్బందిని తొలగించి ఉద్యోగులను తప్పించే ప్రయత్నం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. అంటీ వినాశకరమైన చట్టాలు తీసుకురావడంతో పేదలకు ఉపాధి కోల్పోయి భద్రత కరువయ్య అవకాశాలు ఉన్నాయన్నారు. వెంటనే వి బి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ చట్టాన్ని యథావిధంగా కొనసాగించాలని కోరారు. 300 రోజులు పని కల్పించి, కనీస వేతనం రోజుకు 600 రూపా యలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోడ సోమన్న, సిపిఎం వార్డు సభ్యురాలు నంది పాటి ఉప్పలమ్మ, రైతు సంఘం జిల్లా నాయకులు నందిపాటి వెంకన్న, సిఐటియు మండల నాయకులు జినక జామ్మూర్తి, జినక సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జినక ఎర్ర వెంకన్న, రమణ, సుజాత, శ్రీదేవి, మాధవి, మైసమ్మ, తదితరులు ఉన్నారు.

## వి బి జి రామ్ జి పథకాన్ని తక్షణమే రద్దు చేయాలి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

### మరిపెడ మండలంలోని నిరసన కార్యక్రమాలు

తొలి సమయం మరిపెడ జూలై 1

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లోనీ, ఎల్లంపేట, బోటియ తండా, సోమ్లా తండా, ఆనేపురం, చిల్లంచర్ల, గుండె పూడి, తానంచర్ల, బునాహంపురం, అబ్బాయి పాలెం, పి ఎస్ గూడం, బాల్య ధర్మారం, అమ్ము నాయక్ తండ, గాలి వారి గూడెం, మరిపెడ, తదితర గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేయడం జరిగిందని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి, అలవాల వీరయ్య, గుండ గాని మధుసూదన్ సంయుక్త పట్టణ చేశారు, దేశంలోనీ బిజెపి ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంనీ తొలగించి, దాని స్థానంలో విబిజి రాంజీ పథకాన్ని తీసుకురావడానికి ఆయన తీవ్రంగా విమర్శించారు, దీని ద్వారా దేశంలో దాదాపు 40 కోట్ల మంది, గ్రామీణ పేదలు నష్టపోతారని వివరించారు, రాంజీ పథకం కేంద్ర గవర్నమెంట్, 60 శాతం నిధులు, మరియు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించడాన్ని, మట్టి చూస్తే చట్టాన్ని తప్పు దోవ పట్టించే విధానమే అని, దేశంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు లేక పూర్తిగా ఇబ్బంది పడుతున్నాయని, దీనికి తోడుగా కేంద్ర ప్రభుత్వం, మహాత్మ గాంధీ జాతీయ పదాన్ని చట్టానికి,



40% నిధులు కేటాయించడం అనడం, రాష్ట్ర ప్రభుత్వం ఇరకటంలో పెట్టే పని అవుతుందని విమర్శించారు, ఈ చట్టం 2006లో ఏర్పడ్డాక, దేశంలో గ్రామీణ పేదలకు సమానంగా పని దొరికిందని, మొదటిగా ఈ చట్టంలో పార్లమెంట్లో బడ్జెట్ 2:30 లక్షల కోట్లు కేటాయించారు, కానీ 2026 -27 బడ్జెట్లో కేవలం 87 వేల కోట్లు మాత్రమే కేటాయించారు, దీనిబట్టి చూస్తే చట్టం రద్దు చేసే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వ ఉన్నదని, ఈ విధానాన్ని తక్షణమే నిర్మించుకోవాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కార్మికకర్షణ పోరాటం తప్పదని మరో మారి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మండల ఆర్గనైజర్, బాణాల రాజన్న, మండల కమిటీ సభ్యులు జిన్నా లచ్చన్న బోడుపట్ల రాజశేఖర్ కొండ ఉప్పలయ్య, సభ్యుల ప్రజలు షరీఫ్, బయ్య సురేష్, నలబోడు లక్ష్మిరెడ్డి, అల్లి శ్రీనివాస్ రెడ్డి, పోలేపక గణేష్, ఎండి ఇమామ్ సాబ్, తాడూరి వీరేంకులు, అల్వాల యాకమ్మ, బాణాల శైలజ, తదితరులు పాల్గొన్నారు

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా కంబాలపెల్లిలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### బీఎల్‌వోల ఇంటింటి ఫారాల పంపిణీని

### పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

తొలి సమయం మహబూబాబాద్, జూలై 01:

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని కంబాలపల్లి గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో



ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని 35 వార్డులో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, లకు సిబ్బంది ఫారాల అందజేశారు, జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని షెడ్యూలు ప్రకారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించి పూర్తి సమాచారం అందించడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో సోషల్ మీడియా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఏఈఆర్ఓ కట్టంచంద్ర రాజేశ్వర్ రావు, బిఎల్ఓ సూపర్వైజర్ జి.కవిత, బిఎల్వో పి.కనక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తొలి సమయం

గురువారం । 2 । జులై । 2026

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: సర్పంచ్ కుంజా సుకనయ్య



**తొలి సమయం, ఇల్లందు;జులై, 01:**
గ్రామపంచాయతీప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని గ్రామస్థులందరూ సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని సుదిమల్ల గ్రామ సర్పంచ్ కుంజా సుకనయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, సంబంధిత అధికారులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సంఘం అందజేసిన దరఖాస్తు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి అజహర్, బీఎల్‌వో లక్ష్మీనారాయణ ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు, మార్పులు, తొలగింపులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి, దరఖాస్తులను సక్రమంగా పూరించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొని అధికారులకు సహకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కుంజా సుకనయ్య సూచించారు.

## ఘనంగా బలరాం పదవీ విరమణ సన్మాన కార్యక్రమం



**తొలి సమయం, ఇల్లందు;జులై, 01:**
ఇల్లందు మండల పరిధిలోని ఏహెచ్ఎస్ బొజ్జాయిగూడెం పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బలరాం పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనసరి నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏటీడీఓ భారతి దేవి, పీఆర్‌టీయూటీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు పి. నర్సయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బలరాం సుమారు 35 సంవత్సరాలపాటు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ వేలాది మంది గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి భవిష్యత్తుకు బాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచారని కొనియాడారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ, సేవాభావం చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం బలరాంను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏహెచ్ఎస్ చెన్నాగాల గడ్డ ప్రధానోపాధ్యాయుడు నామ, ఉపాధ్యాయులు శాంత, సాములు, డి. రమేష్, సాయిరాం, బండ రాంబాబు, జి. కృష్ణ, భాస్కర్, కనకరాజు, జ్యోతి, లలిత, సుజాత, బుచ్చయ్య, భద్రు, రాందాస్, హరిరామ్ తదితర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి: అశోక్



**తొలి సమయం, ఇల్లందు;జులై, 01:**
జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రతి రోజూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఇల్లందులో జరిగిన ఏఐకేఎంఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఫెర్టిలైజర్ దుకాణంలో లైసెన్స్, స్టాక్, ధరల వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని కోరారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాల లైసెన్సులు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గోదావరి లోయ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఫోన్ సిగ్నల్ సమస్యల కారణంగా రైతులు యూ రియా యాప్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ యాప్‌ను రద్దు చేసి ప్రత్యామ్నాయ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువులు, దుక్కి మందులు సకాలంలో అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గుగులోతు రామచందర్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యదర్శి బానోత్ ఊక్లా, జిల్లా కార్యదర్శి పడిగామంగన్న పాల్గొన్నారు.

## భూముల హద్దులు చూపించి రైతులకు న్యాయం చేయాలి: ఆదివాసి సంక్షేమ పరిషత్



**తొలి సమయం, ఇల్లందు;జులై, 01:**
ఇల్లందు మండలంలోని మామిడిగుండాల సీలింగ్ భూముల లబ్ధిదారులకు వెంటనే మ్యాప్ పాయింటింగ్ నిర్వహించి భూముల హద్దులు చూపించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సనప విష్ణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇల్లందు మండల ఆదివాసి సంక్షేమ పరిషత్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టాలు పొందిన రైతులు భూముల హద్దులు తెలియక సాగు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే కొంతమంది ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూములను పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధనియాలపాడు రైతులకు కూడా మ్యాప్ పాయింటింగ్ నిర్వహించి భూముల వినియోగానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి మండల అధ్యక్షుడు చింత ఉపేందర్ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి కిన్నెర కిషోర్, ఉపాధ్యక్షుడు ఈసాల రామచందర్, కార్యదర్శి సువర్ణభాకార రాకేష్ తదితరులు పాల్గొన్నారు.